


నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02 4PM

## రికార్డు స్థాయికి చేరిన బంగారం ధర

పసిడి ధరలు మరోసారి చుక్కలు చూపిస్తున్నాయి. తాజాగా బంగారం ధర రికార్డు స్థాయికి చేరింది. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములు రూ.66,680 పలికింది. బులియన్ మార్కెట్‌లో ఈ ధరకు ట్రేడ్ కాగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములు రూ.61,080 చేరింది. కాగా బులియన్ మార్కెట్లో కిలో వెండి ధర రూ.74 వేలకు చేరువైంది.

బంగారం ధర 65,130 10 GRMS 24 CARAT
వెండి ధర 1KG 78,000
సెన్సెక్స్ 73,793 115
నిఫ్టి 22,374 17
చికెన్ ధర 1KG ₹ 280
గుడ్ల ధరలు డజన్₹ 68



## అండర్ వాటర్ మెట్రో రైలులో విద్యార్థులతో కలిసి మోదీ ప్రయాణం

ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కతాలో పర్యటించారు. దేశంలోనే తొలి అండర్ వాటర్ మెట్రో రైలును ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రధాని మోదీ రైలులో ప్రయాణించారు. విద్యార్థులతో పలు అంశాలపై సరదాగా చర్చిస్తూ మోదీ రైలులో ప్రయాణించారు. ప్రధానితో పాటు మెట్రో సిబ్బంది, బీజేపీ చీఫ్ సుకాంత్ మజుందార్, బీజేపీ ఎమ్మెల్యే సువేందు అధికారికూడా ఉన్నారు. ఎస్ ప్లనేడ్ నుంచి హావ్ డా మైదాన్ స్టేషన్ వరకు మోదీ ప్రయాణించారు. ఈ సందర్భంగా మెట్రో సిబ్బంది ప్రధాని మోదీకి నదీగర్భం రైలు ప్రయాణ విశేషాలను వివరించారు. ఇదిలాఉంటే మోదీ నదీగర్భం గుండా ప్రయాణించే మెట్రో రైలులో విద్యార్థులతో కలిసి ప్రయాణించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.



## రేపే కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థుల జాబితా..?

కాంగ్రెస్ పార్టీ లోక్ సభ ఎన్నికలపై దృష్టి సారించింది. రాష్ట్రంలో లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై గురువారం ఢిల్లీలో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం కానుంది. స్క్రీనింగ్‌కమిటీలో చర్చించిన అభ్యర్థులు జాబితాతో రాష్ట్ర పార్టీ ఇన్‌ఛార్జి దీపాదాస్‌మున్షీ ఇప్పటికే ఢిల్లీలో మకాం వేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్లమెంటు అభ్యర్థులుగా అవకాశం ఇస్తామన్న హామీ మేరకు ఆయా నియోజకవర్గాలను వారికే ఇవ్వాలని అధిష్ఠానం సూచించినట్లు తెలుస్తోంది. ఈ భేటీకి CMరేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. అయితే రాష్ట్రంలో లోక్ సభ అభ్యర్థుల ఎంపికపై గురువారం ఢిల్లీలో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం కానుంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్లమెంటు అభ్యర్థులుగా అవకాశం ఇస్తామన్న హామీ మేరకు ఆయా నియోజకవర్గాలను వారికే ఇవ్వాలని అధిష్ఠానం సూచించినట్లు తెలుస్తోంది. ఈ భేటీకి సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు.రాష్ట్ర పార్టీ ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ ఇప్పటికే ఢిల్లీలో మకాం వేశారు.




## చిక్కుల్లో సీఎం ఎంకే స్టాలిన్

తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రశంసలు తెలుపుతూ వెలసిన పోస్టర్లు ఇప్పుడు రాష్ట్రంలోనే కాదు, సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. అందుకు ఈ పోస్టర్‌లలో ఎంకే స్టాలిన్ చిత్రంపై 'బ్రైడ్ ఆఫ్ తమిళనాడు' అని రాసి ఉండటమే కారణం.

**'బ్రైడ్ ఆఫ్ తమిళనాడు'**

టైమ్స్ నౌ ప్రకారం, 'ప్రైడ్ ఆఫ్ తమిళనాడు' అనే పదాలతో పోస్టర్‌ను ముద్రించాలని ప్లాన్ చేశారు. అయితే, అక్షర దోషంతో అది 'బ్రైడ్ ఆఫ్ తమిళనాడు' గా మారి సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది. ఇంతకీ ఈ పోస్టర్‌ను ఎవరు వేశారు? ఎక్కడ పెట్టారు? అనేది తెలియరాలేదు. అయితే, ఈ పోస్టర్ ఉన్న వీడియోను తీసిన పలువురు సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇప్పటి వరకు ఆ వీడియోని 1.2లక్షల మంది వీక్షించారు. ఇదిలా ఉంటే తమిళనాడులోని కులశేఖ పట్టణంలో నిర్మిస్తోన్న ఇస్రో లాంచ్‌ప్యాడ్‌ను ఉద్దేశించి డీఎంకే మంత్రి అనిత ఆర్ రాధాక్రిష్ణన్ ప్రకటన ఇచ్చారు. అందులో ప్రధాని మోదీ, సీఎం స్టాలిన్ ఫోటోలతో పాటు వెనకవైపున రాకెట్‌పై చైనా జెండా ఉండటం వివాదానికి కేంద్ర బిందువయ్యారు.

**మాండరిన్‌లో శుభాకాంక్షలు**

మార్చి 1న బీజేపీ మాండరిన్‌లో ముఖ్యమంత్రి స్టాలిన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది. మాండరిన్ ఆయనకు నచ్చిన భాష అంటూ విష్ చేసి, విమర్శించింది. మాండరిన్.. చైనా అధికారిక భాష. దీనిపై తమిళనాడు సీఎం స్టాలిన్ వివరణ ఇచ్చారు. ప్రకటనలో తప్పిదం దొర్లింది. దాని వెనుక దురుద్దేశం లేదు. భారత్‌పై ప్రేమ ఉంది అని అన్నారు.

# వైసీపీలోకి ముద్రగడ!



కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం మళ్లీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఆ మధ్య జనసేనలోకి వెళ్లేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఆయన్ని.. పవన్ కల్యాణ్ ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానిస్తారనే ప్రచారం సాగింది.. కానీ, ఏం జరిగిందో తెలియదు.. ఈ వ్యవహారంలో ఎలాంటి ముందుడుగు పడలేదు.. ఆ తర్వాత ఈ పరిణామాలపై ముద్రగడ పద్మనాభం అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, ఈ నెల 12వ తేదీన ముద్రగడ.. వైసీపీలో చేరతారని తెలుస్తోంది. ముద్రగడ నివాసానికి వెళ్లిన వైసీపీ నేత జక్కంపూడి గణేష్.. ముద్రగడను ఎంపీ, వైసీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ మిథున్ రెడ్డితో ఫోన్ లో మాట్లాడించారు. అయితే, ఇప్పుడు పోటీ చేసే అవకాశం లేకపోయినా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరికకు ముద్రగడ ఓకే చెప్పినట్టుగా తెలుస్తోంది. ముద్రగడను పార్టీలోకి ఆహ్వానించారట మిథున్ రెడ్డి.. ఇక, మీరు అడుగుతున్నారా? లేక సీఎం జగన్ అడగమన్నారా? అని మిథున్ రెడ్డిని ప్రశ్నించారట ముద్రగడ.. దీంతో.. సీఎం అడగమన్నారని మిథున్ రెడ్డి సమాధానం చెప్పినట్టుగా చెబుతున్నారు. అయితే, పార్టీలో జాయినింగ్ కి తనకు ఎటువంటి అభ్యంతరం లేదని, పోటీ చేసే స్థానం విషయంలో కూడా గెలుపు ఓటములను అంచనావేసి నిర్ణయం తీసుకోవాలని క్లారిటీ ఇచ్చారట ముద్రగడ.. సీఎంకు విషయం చెప్పి స్పష్టత ఇవ్వాలని మిథున్‌రెడ్డిని కోరారట.. అన్ని ఓకే అనుకుంటే సిద్ధం సభలో జాయినింగ్ పెట్టుకుందామని చెప్పినట్టుగా తెలుస్తోంది. ముందు సీఎం జగన్ కి చెప్పండి.. ముహూర్తం బట్టి చూద్దాం అని ముద్రగడ చెప్పినట్టుగా వైసీపీ నేతలు తెలిపారు.








# రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతల ధర్నా

తెలంగాణలో ఎల్ఆర్ఎస్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేపట్టారు. LRS పథకాన్ని ఉచితం చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు నిరసనలు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు.. గతంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఛార్జీలు లేకుండా ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలని కోరుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలు, జిల్లా కేంద్రాల్లో గులాబీ పార్టీ నేతలు ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. అలాగే, హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ, హెచ్‌డీఎంఏ కార్యాలయాల వద్ద నిరసనలు తెలుపుతున్నారు. ఈ క్రమంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి, సీతక్క మాట్లాడిన మాటలను బీఆర్ఎస్ నేతలు గుర్తుచేస్తున్నారు. గతంలో కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారమే 25 లక్షల కుటుంబాలకు ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే సమయంలో ప్రజల నుంచి 20వేల కోట్లు వసూలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని గులాబీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ నిరసనల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ప్రజా ప్రతినిధులు, నేతలు ఉన్నారు. అమీర్‌పేటలోని మైత్రివనం హెచ్ఎండీఏ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ ధర్నాలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

**తలసాని కిరణ్ వినూత్న నిరసన..**

అమీర్‌పేటలోని HMDA కార్యాలయం ముందు బీఆర్ఎస్ నేత తలసాని సాయి కిరణ్ వినూత్న నిరసన చేపట్టారు. వాటర్ బాటిల్స్‌తో హెచ్ఎండీఏ ముందు నిరసన. ఈ క్రమంలో హెచ్ఎండీఏ సిబ్బందికి వాటర్ బాటిల్స్ పంపిణీ చేసిన కిరణ్. తాను ఇచ్చిన నీళ్లు తాగి ప్రశాంతంగా ఎల్ఆర్ఎస్ రద్దు అంశం ఆలోచించాలని కోరిన కిరణ్. ఈ సందర్బంగా తలసాని కిరణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై భారం మోపాలని చూస్తోంది. ఎల్ఆర్ఎస్ వల్ల ప్రజలు ఇబ్బందులు పడతారు. గత ప్రభుత్వాన్ని విమర్శించిన నాయకులు ఇప్పుడెందుకు ఎల్ఆర్ఎస్ అమలు చేస్తున్నారు అని ప్రశ్నించారు.



## నేడు తెలంగాణకు ఎన్డీఎస్ఏ బృందం

కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్లు, నిర్మాణాన్ని పరీక్షించేందుకు కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్ జె.చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఏర్పాటు చేసిన ఆరుగురు సభ్యుల కమిటీ బుధవారం రాష్ట్రానికి రానుంది. బుధవారం మధ్యాహ్నం జలసౌధలో నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీలతో సమావేశం కానుంది. ఈ నెల 7, 8వ తేదీల్లో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను సందర్శించి తనిఖీలు నిర్వహించనుంది. మళ్లీ 9న హైదరాబాద్‌లో అధికారులు, నిర్మాణ సంస్థలతో సమావేశం కానుంది. అదేరోజు సాయంత్రం ఢిల్లీకి తిరిగి వెళ్లనుంది. మరోవైపు బ్యారేజీల డిజైన్లు మొదలు నిర్మాణం వరకు ఇందులో పాలుపంచుకున్న అధికారులు తమ వెంట ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని కమిటీ కోరింది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన 19 రకాల సమాచారం అందించాలని లేఖ రాసింది.

## నంద్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదం.. ఐదుగురు మృతి

నంద్యాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల వద్ద హైవేపై లారీని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతిచెందారు. వీరిలో నవ దంపతులు ఉన్నారు. మృతులను హైదరాబాద్ వాసులుగా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని వెస్ట్ వెంకటాపురం ప్రాంతానికి చెందిన మంత్రి రవీందర్ తన కుటుంబంతో కలిసి కారులో తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లారు. అనంతరం తిరిగివస్తుండగా నల్లగట్ల హైవేపై నెమ్మదిగా వెళుతున్న లారీని వెనుకనుంచి కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో రవీందర్‌తో పాటు అతడి భార్య లక్ష్మి, కుమారుడు బాల కిరణ్, కోడలు కావ్య, మరో కుమారుడు ఉదయ్‌కిరణ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. గత నెల 29న బాల కిరణ్‌కు కావ్యతో గుంటూరు జిల్లా తెనాలిలో వివాహం జరిపించారు. ఈనెల 3న శామీర్‌పేటలో ఘనంగా రిసెప్షన్ పూర్తి చేశారు. 4న నూతన దంపతులను తీసుకుని వెంకన్న దర్శనం కోసం తిరుమలకు వెళ్లారు. తిరిగి వస్తుండగా ఈ ఘోరం జరిగింది.

## చంద్రబాబుతో పవన్ భేటీ




టీడీపీ అధినేత చంద్రబాబుతో జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ భేటీ అయ్యారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో సమావేశం జరిగింది. మలివిడత అభ్యర్థుల ఎంపికపై వీరిద్దరూ చర్చించినట్లు సమాచారం. టీడీపీ-జనసేన కూటమిలో భాజపా చేరే అంశంపై గత కొంతకాలంగా చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే చంద్రబాబు, పవన్ దిల్లీ వెళ్లే అవకాశముంది. ఈ నేపథ్యంలో అక్కడి పరిణామాలపై నేతలిద్దరూ మాట్లాడుకున్నట్లు సమాచారం.




## చరణ్ 16లో జాన్వీ ఫిక్స్

ప్రస్తుతం గ్లోబల్ మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు శంకర్ తో భారీ చిత్రం "గేమ్ ఛేంజర్" చేస్తున్న సంగతి తెలిసిందే. మరి ఈ సినిమా శంకర్ కి చరణ్ కి 15వ సినిమా కాగా దీని తర్వాత చరణ్ దర్శకుడు బుచ్చిబాబు సానా తో చేస్తున్న సంగతి తెలిసిందే. ఇక ఈ సినిమా పై కూడా మేకర్స్ చాలా నమ్మకంగా ఉండగా ఇప్పుడు ఈ చిత్రం నుంచి ఓ అఫీషియల్ క్లారిటీ అయితే వచ్చేసింది. గత కొన్నాళ్ల కితమే ఈ చిత్రంలో బాలీవుడ్ యంగ్ హీరోయిన్ జాన్వీ కపూర్ హీరోయిన్ గా కన్ఫర్మ్ అయ్యింది అని టాక్ వచ్చింది. వీటిని బోనీ కపూర్ కూడా కన్ఫర్మ్ చేయగా ఇప్పుడు మేకర్స్ దీనిపై అధికారిక క్లారిటీ అయితే ఇచ్చేసారు. చరణ్ 16 లో హీరోయిన్ గా జాన్వీ కపూర్ నటిస్తున్నట్టుగా ఈరోజు ఆమె బర్త్ డే కానుకగా అయితే ఇప్పుడు ప్రకటించారు. మరి దీనితో ఈమె టాలీవుడ్ లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ "దేవర" తర్వాత మరో భారీ ఆఫర్ ని అందుకుంది అని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు అలాగే వృద్ధి సినిమాస్ మరియు మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.






# పేటీఎంకు షాక్

పేటీఎం సంక్షోభం ఇప్పట్లో తగ్గుముఖం పట్టే సూచనలు కనిపించడం లేదు. RBI చర్య, EDతదుపరి విచారణ Paytm ను నాశనం చేసింది. ఇప్పుడు బయటకు వచ్చిన రిపోర్ట్ మరింత భయానకంగా ఉంది. ఫిబ్రవరి నెలలో Paytm UPI లావాదేవీలలో ప్రతి గంటకు 1.5 లక్షల రూపాయల కంటే ఎక్కువ తగ్గింది. అవును, ఈ డేటా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డేటా నుంచి వచ్చింది. అంటే జనవరితో పోలిస్తే ఫిబ్రవరి నెలలో Paytm UPI లావాదేవీలు 7.6 శాతం తగ్గాయి. ఎలాంటి NPCI గణాంకాలు కనిపిస్తున్నాయో తెలుసుకుందాం. Paytm యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (UPI) లావాదేవీలలో క్షీణత ఉన్నట్లు NPCI డేటా చూపించింది. ఫిన్‌టెక్ కంపెనీ ఫిబ్రవరిలో 1.33 బిలియన్ల లావాదేవీలను నివేదించింది. ఇది జనవరిలో 1.44 బిలియన్ల లావాదేవీల కంటే 7.6 శాతం తక్కువ. విశేషమేమిటంటే, ఫిబ్రవరిలో Paytm ప్రాసెస్ చేసిన UPI చెల్లింపుల వాటాలో 11 శాతం కంటే తక్కువ క్షీణత ఉంది. ఇది అంతకుముందు నెలలో 11.8 శాతం. ఆగస్ట్ 2023లో Paytm మార్కెట్ వాటా 12.8 శాతంగా ఉంది. ఫిబ్రవరి చిన్న నెల అయినప్పటికీ మొత్తం UPI వాల్యూమ్ జనవరిలో 12.2 బిలియన్ లావాదేవీలతో పోలిస్తే 12.1 బిలియన్ లావాదేవీలకు స్వల్పంగా తగ్గింది. Paytm లావాదేవీల పరిమాణంలో భారీ క్షీణత ఉంది. ఫిబ్రవరి నెలలో ప్రతి గంటకు 1.58 లక్షల UPI లావాదేవీలు తగ్గాయి. ఇది విపరీతమైన క్షీణతను సూచిస్తోంది. మరోవైపు, PhonePe, Google Pay లావాదేవీలలో మంచి పెరుగుదల ఉంది. PhonePe ఫిబ్రవరిలో 6.1 బిలియన్ల లావాదేవీలను చూసింది. Google Payలో 4.7 బిలియన్ UPI చెల్లింపులు రికార్డ్ చేయబడ్డాయి. అంటే రెండూ వరుసగా 7.7 శాతం, 7.9 శాతం జంప్‌ను చూశాయి. జనవరి 31న Paytm పేమెంట్స్ బ్యాంక్‌పై RBI చర్య తీసుకుంది. దీని తర్వాత Paytm UPI చెల్లింపు వ్యాపారం బాగా ప్రభావితమైంది. సెంట్రల్ బ్యాంక్ ఆడిట్ నివేదిక, బ్యాంకులో నిరంతర అక్రమాలను బహిర్గతం చేయడం వల్ల RBI చర్య తీసుకోవలసి వచ్చింది. RBI ఆదేశాల ఫలితంగా ఫిబ్రవరి 29 తర్వాత డిపాజిట్లు, క్రెడిట్ లావాదేవీలను స్వీకరించడాన్ని నిలిపివేయాలని Paytm పేమెంట్స్ బ్యాంక్‌ని ఆదేశించింది. ఆ గడువును మార్చి 15 వరకు పొడిగించారు. అదనంగా, PMLA కింద ఆరోపించిన ఉల్లంఘనలకు సంబంధించి Paytm పేమెంట్స్ బ్యాంక్‌పై ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్-ఇండియా (FIU) రూ. 5.49 కోట్ల జరిమానా విధించింది. ఈ సవాళ్లు ఉన్నప్పటికీ Paytm వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ కంపెనీ భవిష్యత్తు అవకాశాల గురించి ఆశాజనకంగానే ఉన్నారు.



## హైదరాబాద్‌కు చేరుకున్న సన్‌రైజర్స్ ప్లేయర్స్..
# ఉప్పల్‌లో ప్రాక్టీస్ షురూ!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17 సీజన్ ఆరంభానికి సమయం దగ్గరపడుతోంది. మార్చి 22న ఐపీఎల్ 2024 ఆరంభం కానుంది. లీగ్ ప్రారంభానికి ఇంకా రెండు వారాల సమయం మాత్రమే ఉండడంతో అన్ని టీమ్స్ ప్రాక్టీస్ సెషన్‌ను ఆరంభించాయి. ఈ క్రమంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) మంగళవారం (మార్చి 5) హోం గ్రౌండ్ ఉప్పల్ స్టేడియంలో తొలి టీమ్ మీటింగ్ ఏర్పాటు చేసింది. ఆపై ఎస్ఆర్‌హెచ్ ప్లేయర్స్ ప్రాక్టీస్ షురూ చేశారు. ఉప్పల్ స్టేడియంలో మంగళవారం ఆరంభమైన ప్రాక్టీస్‌లో భారత పేసర్ టీ నటరాజన్ సహా మరి కొందరు ప్లేయర్స్ ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. టీమ్ మీటింగ్ అనంతరం ప్లేయర్స్ బ్యాటింగ్, బౌలింగ్ సాధన చేశారు. ఇందుకుసంబంధించిన ఫోటోలను ఎస్ఆర్‌హెచ్ మేనేజ్‌మెంట్ ట్విటర్‌లో పోస్ట్ చేసింది. ఐపీఎల్ 2024లో తొలి మ్యాచ్‌ను మార్చి 23న ఎస్ఆర్‌హెచ్ ఆడనుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)ను సన్‌రైజర్స్ ఢీకొంటుంది. తొలి విడతలో సన్‌రైజర్స్ నాలుగు మ్యాచ్‌లు ఆడనుంది. మార్చి 23న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో తలపడనున్న సన్‌రైజర్స్ హైదరాబాద్.. మార్చి 27న ముంబై ఇండియన్స్‌తో ఢీ కొడుతుంది. మార్చి 31 గుజరాత్ టైటాన్స్‌తో, ఏప్రిల్ 5 చెన్నై సూపర్ కింగ్స్‌తో ఎస్ఆర్‌హెచ్ ఆడుతుంది. వీటిలో ముంబై, చెన్నై మ్యాచ్‌లు హైదరాబాద్‌లో జరుగనుండగా.. గుజరాత్‌తో మ్యాచ్‌కు అహ్మదాబాద్ ఆతిథ్యం ఇస్తుంది. త్వరలోనే మిగతా ప్లేయర్స్ ఎస్ఆర్‌హెచ్ జట్టులో చేరనున్నారు.

# హాట్ లుక్‌లో ఖుషీ కపూర్

శ్రీదేవి కుమార్తె మరియు నటి ఖుషీ కపూర్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో చాలా కూల్ లుక్‌లో చిత్రాలను పంచుకున్నారు.ఖుషీ కపూర్ కొత్త లుక్‌లో చాలా కూల్ పోజ్ ఇస్తోంది.ఖుషీ కపూర్ యొక్క ఈ గ్లామరస్ లుక్ వైరల్ అవుతోంది.నటి ఖుషీ డిఫరెంట్ లుక్‌లలో చాలా బాగుంది. ఖుషీ కపూర్ అభిమానులు కూడా ఈ లుక్‌ను ఇష్టపడ్డారు.ఖుషీ కపూర్ ఈ చిత్రాలలో చాలా అందమైన పోజ్ ఇస్తున్నారు.ఆమె లెహంగా డ్రాప్ షోల్డర్ డిజైన్‌ను కలిగి ఉంది, అది ఆమె చక్కగా ఒత్తుగా ఉన్న ఫిగర్‌ని ప్రదర్శించడానికి ఆమెకు అవకాశం ఇచ్చింది. ఆమె జుట్టును హాఫ్ టై హెయిర్‌డోతో మృదువైన అలలుగా తీర్చిదిద్దారు. ఖుషీ తన దుస్తులకు బాగా సరిపోయే స్టేట్‌మెంట్ చోకర్‌తో యాక్సెసరైజ్ చేసింది. వివాహానికి ముందు ఈ ఫంక్షన్‌లో ఖుషీ తన ప్రియుడు వేదంగ్ రైనాతో కలిసి పుకారు వచ్చింది.



# బీసీ డిక్లరేషన్.. చంద్రబాబు కొత్త డ్రామా



బీసీలను మోసం చేసేందుకు చంద్రబాబు మరోసారి వస్తున్నారంటూ వైసీపీ ఎంపీ మార్గాని భరత్ మండిపడ్డారు. బుధవారం రాజమండ్రిలో ఆయన మాట్లాడుతూ.. బీసీ డిక్లరేషన్‌తో చంద్రబాబు కొత్త డ్రామాకు తెరలేపారన్నారు. చంద్రబాబు బీసీలకు ఎన్ని సీట్లు ఇచ్చారంటూ ప్రశ్నించారు. ఎన్నికలు వచ్చినప్పుడే చంద్రబాబుకు బీసీలు గుర్తొస్తారని ఎంపీ భరత్ ధ్వజమెత్తారు. బీసీ పదం ఎత్తడానికి చంద్రబాబుకు అర్హత లేదన్నారు. బీసీలకు వైసీపీ అండగా నిలుస్తూ వచ్చిందన్నారు.

## శర్వానంద్ నుంచి
# మరో ప్రామిసింగ్ సినిమాగా మనమే




టాలీవుడ్ యంగ్ అండ్ ప్రామిసింగ్ హీరోస్ లో టాలెంటెడ్ హీరో శర్వానంద్ కూడా ఒకడు. మరి మరి టాలీవుడ్ ఎన్నో ఎంటర్టైనర్స్ ని అందించిన శర్వానంద్ ఇప్పుడు మరిన్ని ఆసక్తికర ప్రాజెక్ట్ లని అయితే చేస్తున్నాడు. మరి ఈ చిత్రాల్లో తన కెరీర్ 35వ చిత్రంపై తన బర్త్ డే కానుకగా అయితే మేకర్స్ ఇప్పుడు బ్యూటిఫుల్ అప్డేట్ ని అందించారు. ఒక ప్లెజెంట్ మోషన్ పోస్టర్ టీజర్ కట్ తో "మనమే" అంటూ టైటిల్ ని లాక్ చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ ని రిలీజ్ చేశారు. మరి ఇందులో పెయింటింగ్ రోల్ పట్టుకొని శర్వానంద్ అలాగే పక్కనే ఓ చిన్ని బాబు కనిపిస్తున్నారు. దీనితో ఈ సినిమా మంచి క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ అన్నట్టుగా అర్థం అవుతుంది. అలాగే టీజర్ లాస్ట్ లో శర్వానంద్ సహా హీరోయిన్ కృతి శెట్టి కూడా కనిపించింది. మరి ఇద్దరి మధ్య మంచి కెమిస్ట్రీ కూడా ఉండేలా ఉందని చెప్పాలి. ఇక ఈ చిత్రాన్ని దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య తెరకెక్కిస్తుండగా ట్రెండింగ్ మ్యూజిక్ డైరెక్టర్ హీషం అబ్దుల్ వాహబ్ సంగీతం అందిస్తున్నాడు. అలాగే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారు నిర్మాణం వహిస్తున్నారు.

## బీఆర్ఎస్‌కు కోనప్ప గుడ్‌బై..!
# సెక్రటేరియట్‌లో మంత్రి పొంగులేటితో భేటీ



బీఆర్ఎస్ నేత, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బుధవారం ఉదయం తెలంగాణ సెక్రటేరియట్‌లో రాష్ట్ర రెవెన్యూ,సమాచార మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చాంబర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడున్న మీడియా ప్రతినిధులతో ఆయన ముచ్చటించారు. కార్యకర్తలతో మాట్లాడి అభిప్రాయాలు తీసుకున్న తర్వాత తన రాజకీయ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తుపెట్టుకుంటున్నట్లు మంగళవారం రెండు పార్టీల అధ్యక్షులు ప్రెస్‌మీట్‌లో ప్రకటించిన విషయం తెలిసిందే. బీఎస్పీతో పొత్తు విషయంలో అసంతృప్తికి గురైన కోనప్ప బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రచారం జోరందుకుంది. ఈ క్రమంలోనే కోనప్ప సచివాలయానికి వచ్చి సీఎం రేవంత్ మంత్రి వర్గంలో కీలక మంత్రిగా పేరున్న పొంగులేటితో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా, గత ఏడాది జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ తెలంగాణ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సిర్పూర్ నుంచి కోనప్పపై పోటీ చేసిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు కొనసాగితే తన రాజకీయ భవిష్యత్తుకు ప్రమాదం అని భావించిన కోనప్ప పార్టీ మార్పు దిశగా అడుగులు వేస్తున్నట్లు చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పోటీ కోనప్ప, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మధ్య ఉంటుందని అందరూ భావించినప్పటికీ సిర్పూర్ నుంచి అనూహ్యంగా బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు.



# మళ్లీ రైతుల 'ఢిల్లీ ఛలో' ప్రారంభం

పంటలకు మద్దతుధర కోసం రైతులు చేపట్టిన నిరసన మార్చ్ ఢిల్లీ ఛలో బుధవారం(మార్చ్ 6) ఉదయం మళ్లీ మొదలు కానుంది. పంటలకు కనీస మద్దతు ధర, రైతులకు పెన్షన్, రుణమాఫీ, కరెంటు ఛార్జీలు యథాతథంగా కొనసాగించడం లాంటి డిమాండ్లతో రైతులు ఢిల్లీ ఛలో నిరసన మార్చ్‌ను ఫిబ్రవరిలోనే ప్రారంభించారు. అయితే కేంద్ర ప్రభుత్వంతో చర్చల కోసం తొలి విడత విరామం ప్రకటించారు. చర్చలు విఫలమవడంతో రెండో విడత మార్చ్ కూడా ఫిబ్రవరిలోనే నిర్వహించారు. అనంతరం మూడవ విడత నిరసన మార్చ్‌ను బుధవారం నుంచి పునరుద్ధరించనున్నారు. రైతుల తాజా ఢిల్లీ ఛలో పిలుపుతో ఢిల్లీ చుట్టుపక్కల ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా రాష్ట్రాల నుంచి ఢిల్లీలోకి వచ్చే టిక్రీ,సింగు, ఘాజీపూర్ సరిహద్దుల వద్ద పోలీసులు భద్రత పెంచారు. ఈ సరిహద్దుల వద్ద రైతులు ఫిబ్రవరి 13 నుంచి క్యాంపులు వేసుకుని నిరసన తెలుపుతున్నారు. ఫిబ్రవరి 18న కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఐదు సంవత్సరాల పాటు కనీస మద్దతు ధర ఆఫర్‌ను రైతుసంఘాలు తిరస్కరించడంతో ప్రభుత్వంతో రైతుల చర్చలు విఫలమయ్యాయి. దీంతో ఢిల్లీ ఛలో మార్చ్‌ను రైతు సంఘాలు మళ్లీ పునరుద్ధరించాయి.




## చరిత్ర సృష్టించిన ముంబై ఇండియన్స్
# స్టార్ బౌలర్ షబ్‌నమ్ ఇస్మాయిల్

ముంబై ఇండియన్స్ స్టార్ బౌలర్ షబ్‌నమ్ ఇస్మాయిల్.. మహిళ క్రికెట్‌లో కొత్త చరిత్ర లిఖించింది. దక్షిణాఫ్రికాకు చెందిన ఆ బౌలర్.. అత్యంత వేగవంతమైన బంతిని వేసి రికార్డును నెలకొల్పింది. వుమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇస్మాయిల్ ఆ ఘనత సాధించింది. ఇప్పటి వరకు మహిళల క్రికెట్‌లో అత్యంత స్పీడ్ బంతి గంటకు 130 కిలోమీటర్లు మాత్రమే. కానీ మంగళవారం నాటి మ్యాచ్‌లో ఇస్మాయిల్ 132.1 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేసింది. మహిళల క్రికెట్‌లో గంటకు 130 కిలోమీటర్ల వేగం దాటడం ఇదే మొదటి సారి. ఆ బంతి మాజీ ఆసీస్ కెప్టెన్ మెగ్ లానింగ్ ప్యాడ్స్‌ను గట్టిగా ఢీకొట్టింది. సౌతాఫ్రికాతో తరపున ఇస్మాయిల్ 8 వరల్డ్‌కప్‌లు ఆడింది. ఇటీవలే ఆమె అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్నది. ఓసారి విండీస్‌తో మ్యాచ్‌లో 128 కిలోమీటర్ల వేగంతో, ఆ తర్వాత 2022 వరల్డ్‌కప్‌లో 127 కిలోమీటర్ల వేగంతో ఓసారి బౌలింగ్ చేసింది.